ప్రజాశక్తి
సోమవారం 31 జులై 2023
5
అల్లూరి సీతారామరాజు

నియోజకవర్గ అభివృద్ధికి రూ.7.20 కోట్లు

ప్రజాశక్తి-దుంబ్రిగుడ: అరకు నియోజకవర్గ అభివృద్ధికి రూ.7.20 కోట్లు మంజూరయ్యాయని ఎమ్మెల్యే ఫాల్గుణ తెలిపారు. మండల కేంద్రంలో ఆదివారం పర్యటించిన ఆయన ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఆరు మండలాల్లో అభివృద్ధికి ఒక్కో మండలానికి ప్రభుత్వం రూ.1.20 కోట్లు మంజూరు చేసిందన్నారు. మంజూరైన నిధులతో అభివృద్ధి పనులు చేసేందుకు ప్రతిపాదనలు తయారు చేసి నివేదికలను అందించి గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి తోడ్పాటు ఇవ్వాలన్నారు. వెనుకబడిన పంచాయతీలపై దృష్టి సారించి అభివృద్ధి పనులు చేసేందుకు సమన్వయంతో ముందుకెళ్లాలని చెప్పారు. సమన్వయంతో పని చేసి పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఈశ్వరి, జడ్పీటీసీ జానకమ్మ, వైస్ ఎంపీపీలు ఆనందరావు, లలిత, మండల మహిళా అధ్యక్షురాలు శాంతి, మాజీ జడ్పీటీసీ సభ్యుడు శ్రీరాములు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, మండల నాయకులు పాల్గొన్నారు.

చింతూరులో నీటమునిగిన దుకాణ సముదాయం

శబరి, గోదావరి శాంతించినా...

ఇంకా జలదిగ్బంధంలోనే..

- నీటి ముంపులోనే ప్రజల అవస్థలు
- సహాయక చర్యలు ముమ్మరం
- పునరావాస కేంద్రాల్లో సౌకర్యాల లేమిపై ఆవేదన

ప్రజాశక్తి-చింతూరు : శబరి, గోదారి నదులు ఆదివారం మధ్యాహ్నానికి ఎట్టకేలకు శాంతించి తగ్గుముఖం పట్టినా, ముంపు గ్రామాల్లో భయం వీడిపోలేదు. ఇంకా అనేక గ్రామాలు జలదిగ్బంధంలోనే ఉన్నాయి. నాలుగు రోజులుగా గణనీయంగా పెరిగిన వరద నీటి మట్టాలు ప్రజలను భయాందోళనకు గురిచేశాయి. నాలుగు రోజులుగా వర్షాలు లేకపోయినప్పటికీ, ఎగువ పరివాహక ప్రాంతంలో కురిసిన వర్షాలకు ఉప్పొంగిన గోదావరి ఎగపోటుతో శబరి బ్యాక్‌వాటర్ ప్రభావంతో చింతూరు మండల పరిధిలో 100 గ్రామాలకు సంబంధాలు తెగిపోయాయి.లోతట్టు ప్రాంతాలు ముంపు బారినపడ్డాయి. 11పునరావాస కేంద్రాల్లో నిర్వాసితులు తలదాచుకున్నారు. శనివారం మధ్యాహ్నానికి 55.30 అడుగులకు చేరిన గోదావరి నీటిమట్టం నిర్వాసితులకు ముచ్చెమటలు పట్టించింది. చింతూరు వద్ద శబరి నది 44 అడుగులకు చేరి ప్రమాద స్థాయిలో ప్రవహించింది. గోదావరి ఎగువన ఉన్న పేరూరు వద్ద వరద నీరు క్రమేపీ తగ్గటంతో శబరి గోదారి నదులు శాంతించినాయి. ఆదివారం గోదావరి నదిలో దిగువకు 15,26,200 క్యూసెక్కుల నీరు దిగువకు వెళుతుంది. వరదలు తగ్గుముఖం పట్టడంతో అధికారులు సహాయ కార్యక్రమాలను ముమ్మరం చేస్తున్నారు. నిత్యాసర వస్తువులు, కూరగాయలు పాలు తదితర వాటిని మర బోట్ల ద్వారా తరలిస్తున్నారు. పునరావాస కేంద్రాల్లో ఉన్న ఒక్కో కుటుంబానికి కేజీ కందిపప్పు అందజేశారు. వ్యాధులు ప్రజలకుండా ప్రాంతాల్లో హెల్త్ సెంటర్లను ఏర్పాటు చేసి అప్రమత్తం చేశారు.

కాపర్ డ్యామ్ వల్లే తగ్గని నీటిమట్టం

విఆర్.పురం : భద్రాచలం దిగువ ప్రాంతమైన శబరి గోదావరి సంగమం ఒడ్డుగూడెం, శ్రీరామగిరి వద్ద వరద ప్రభావం అలాగే ఉంది, ఆదివారం భద్రాచలం వద్ద గోదావరిలో మూడు అడుగుల మేర నీటిమట్టం తగ్గినప్పటికీ, సంగమ ప్రాంతంలో ఒక్క అంగుళం కూడా తగ్గలేదని, దీనికి కాపర్ డ్యామ్ నుంచి ఎగపోటే కారణమని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పునరావాస కేంద్రాల్లో అరకొర సౌకర్యాలు

పునరావాస కేంద్రాలకు తరలివెళ్లిన ధర్మతాలగూడెం, గొల్లగూడెం గ్రామాల ప్రజలు అక్కడ కనీస సౌకర్యాలు లేక ఇబ్బంది పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు పట్టించుకోవట్లేదని, కనీసం గుడారాల మీదకు బరకాలుగాని తినడానికి నిత్యవసర వస్తువులు, తాగటానికి తాగునీరు గాని అందించలేదని వాపోతున్నారు. రాత్రి వేళలో కరెంటు లేక ఎటునుంచి విష పురుగులు వస్తుందేమోనని బిక్కుబిక్కుమంటూ జీవిస్తున్నామని వాపోతున్నారు. తక్షణమే అధికారులు స్పందించి జనరేటర్లు సమకూర్చి, కరెంటు సౌకర్యం కల్పించాలని నిర్వాసితులు కోరుతున్నారు. పునరవాస కేంద్రాలకు వచ్చిన తమకు రవాణా ఖర్చుల కింద ఒక్కో కుటుంబానికి రూ.ఐదువేలు చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు.

కూనవరంలో శబరి వంతెన పైనుంచి ప్రవహిస్తున్న వరదనీరు

ఊపిరి పీల్చుకుంటున్న ముంపు బాధితులు

ఎటపాక : పది రోజులుగా ముంచెత్తిన వరద ఆదివారానికి కాస్త తగ్గుముఖం పట్టింది. మూడు రోజులుగా వర్షాలు లేకపోవడం, ఎగువ నుండి వరద క్రమేపి తగ్గుతూ ఉండటంతో ముంపు ప్రాంతాల ఊపిరి పీల్చుకున్నారు. జలదిగ్బంధంలో ఉన్న గ్రామాలకు, ముంపు ప్రభావిత ప్రాంతాలకు నిత్యావసరాలు అందించే కార్యక్రమాన్ని ఆదివారం అధికారులు చేపట్టారు. ఒక్కో కుటుంబానికి పాలు, ఉల్లిపాయలు, బంగాళదుంపలు, ఆయిల్, కందిపప్పు, అందజేశారు. నందిగామ, మురుమూరు, బండారిగూడెం, చలంపాలెం, ఎర్రగట్టు, గ్రామాలకు రెండు రోజులుగా కరెంట్ సౌకర్యం లేదు. తాగు నీటికి ఇబ్బందులు పడ్డామని ఆవేదన వ్యక్తం చేశారు. వరద క్రమేపీ తగ్గడంతో కొన్ని గ్రామాలకు రాకపోకలు సాగుతున్నాయి.

సిపిఎం బృందం పరామర్శ

ముంపు బాధితులకు సరుకులు ఇస్తున్న సిపిఎం నేతలు

విఆర్.పురం: శబరి గోదావరి సంగమ ప్రాంతమైన గొల్లగూడెం గ్రామాన్ని సిపిఎం బృందం సందర్శించింది. ముంపుబాధిత ప్రజలను పరామర్శింఆచరు. వారి కష్టాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గోదారి, శబరి నదులు ముంచెత్తడంతో సామాన్లను ఎత్తున పెట్టి, నీటిమునిగిన ఇళ్లల్లోనే, గాడాంధకారంలో రాత్రంతా బిక్కుబిక్కుమంటూ గడిపామని నిర్వాసితులు ఆవేదన వ్యక్తం చేశారు. తమకు పరిహారం, ప్యాకేజీ ఇచ్చి ఈ కష్టాల నుంచి విముక్తి కలిపించాలని వేడుకుంటున్నారు

ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు సత్యనారాయణ మాట్లాడుతూ, గొల్లగూడెం ప్రజలను తక్షణమే పునరావాస కేంద్రాలకు తరలించి, వారికి అవసరమైన సౌకర్యాలను కల్పించాలని కోరారు. ఏటా ముంపు కష్టాలతో ఇబ్బందులు పడుతున్న బాధితులకు న్యాయబద్ధంగా రావాల్సిన ప్యాకేజీ, పరిహారం ఇచ్చి, వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించాలని కోరారు.

అనంతరం పునరావాస కేంద్రాల్లో ఉన్న వడ్డుగూడెం సచివాలయం పరిధిలోని ధర్మతాలగూడెం, వడ్డుగూడెం ప్రజలకు నిత్యవసర సరుకులు, కూరగాయలను స్థానిక సర్పంచ్ సోడి నరసమ్మ., సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పూనం సత్యనారాయణ, శ్రీరామగిరి సర్పంచ్ పులి సంతోష్ కుమార్, సచివాలయం సెక్రెటరీ స్వరూప రెడ్డి కూరగాయలు అందజేశారు కార్యక్రమంలో మండల నాయకులు గూటాల శ్రీనివాసరావు,. ప్రకాశరావు చందర్రావు పాల్గొన్నారు.

అరకొరగా నిత్యావసర సరుకులు

ఎటపాక : నెల్లిపాక పంచాయతీ, వీరాయిగూడెం గ్రామంలో ప్రభుత్వ అధికారులు పంచుతున్న నిత్యవసర సరుకులను సిపిఎం నాయకులు పరిశీలించారు. ఐదు రకాల సరుకులను అరకొరగా పంచి చేతులు దులుపుకుంటున్నారు. పంచిన సరుకులలో బియ్యం, మంచినూనె, టమాటాలు, ఉప్పు లేవని సిపిఎం నేతలు ఆవేదన వ్యక్తం చేశారు. తాగడానికి మంచినీళ్ల ఇవ్వకపోవడం దుర్మార్గమనిసిపిఎం ఎటపాక మండల కార్యదర్శి ఐ.వి. అన్నారు. ముంపు సమస్యపై ముందుగానే రెండు నెలల క్రితమే తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టి, సిపిఎం హెచ్చరించినా అధికారులు చర్యలు చేపట్టకపోవడంపై మండిపడ్డారు.. సిపిఎం ఒత్తిడితో నెల్లిపాక వీరాయిగూడెం మధ్య బోటు ఏర్పాటు చేశారు. అయితే బాధితులను పూర్తిస్థాయిలో ఆదుకోవడంలో అధికారులు విఫలమయ్యారని మండిపడ్డారు.

బాధితుల పట్ల నిర్లక్ష్య వైఖరి తగదు

కూనవరం : గత అనుభవాలను దృష్టిలో పెట్టుకున తగు జాగ్రత్తలు, సహాయక చర్యలకు సన్నద్ధం కావాలని సిపిఎం పలుమార్లు హెచ్చరించినా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని సిపిఎం మండల కార్యదర్శి పాయం సీత రామయ్య మండిపడ్డారు. ముందస్తుగా ఎక్కడెక్కడ, ఏమేమీ సరుకులు నిల్వ చేయాలో సూచించినా అధికారులకు పట్టలేదన్నారు. కూనవరం మండలంలో వరద చుట్టుముట్టిన గ్రామాలకుగానీ,ముంపు ప్రాంతాల ప్రజలకు కానీ ఇంత వరకు నిత్యావసర వస్తువులు ఇవ్వలేదు. ఆగస్టు నెల ఉచిత బియ్యం ఇచ్చి, వరద సాయం ఇచ్చినట్లు ప్రభుత్వం, అధికార్లు చెప్పడం ఘోరం. భద్రాచలంలో మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేసిన వెంటనే 10 గ్రామపంచాయతీల పరిధిలోని గ్రామాలకు విద్యుత్ కట్ చేస్తారు సచివాలయంలో సమాచార వ్యవస్థ ఆగిపోయింది. కూటూరు పిహెచ్‌సిలో విద్యుత్ లేక చీకటిలో వైద్యం చేస్తున్నారు .శబరి గోదావరి వరద ముంపులో కూనవరం మండలం మొత్తం జెల దిగ్బంధంలో వుంది. కోతులగుట్ట నుండి ఏడుగురాళ్ళ పల్లి వరకు. బురద గూడెం నుండి వేకవారిగూడెం వరకు చిన్నార్కురూ నుండి బోదనూరు వరకు రోడ్లు వేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలోజిల్లా నాయకులు మేకల నాగేశ్వరావు, సర్పంచులు మడకం నాగమణి, బొగ్గా వెంకమ్మ, ఎంపిటిసి ధర్మల అమ్మాజి, అశోక్, పాయం సత్యనారాయణ పాల్గొన్నారు

మాట్లాడుతున్న సిపిఎం నేత సీతారామయ్య

రెండు రోజుల్లో అందరికీ టార్పాలిన్లు, నిత్యావసరాలు

- సిపిఎం బృందానికి కలెక్టర్ హామీ

కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న సిపిఎం నేతలు

చింతూరు : చింతూరు డివిజన్లోని నాలుగు విలీన మండలాల్లో వరద ముంపు బాధిత నిర్వాసితులకు రెండు మూడు రోజుల్లో అందరికీ టార్పాలిన్లు, కిరోసిన,అన్ని రకాల నిత్యవసర సరుకులు ఇస్తామని, దోమతెరలు అందించి, మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేచేస్తామని కలెక్టర్ సుమిత్‌కుమార్ హామీనిచ్చారు. కలెక్టర్‌ను కలిసిన సిపిఎం బృందం ముంపు బాధితులకు పూర్తిస్థాయిలో సౌకర్యాలు మెరుగుపరిచి, బియ్యం, మంచి నూనెతో సహా 6 రకాల నిత్యవసర సరుకులు, టార్పాలిన్సు, మంచినీరు, కుటుంబానికి రెండు దోమతెరలు, కిరోసిన్ కొవ్వొత్తులు ఇవ్వాలని కోరారు. ప్రతి కుటుంబానికి ఒక టార్చి లైట్ ఇవ్వాలని, సామాన్ల తరలింపునకు రవాణా ఖర్చులకు రూ.ఐదు వేలు ఇవ్వాలని విన్నవించారు. ఆసుపత్రులకు తరలించిన గర్భిణులకు పాలు గుడ్డుతో సహా పౌష్టికాహారం అందించాలని,పాము, కుక్కకాటు వ్యాక్సిన్స్ అందుబాటులో ఉంచాలని కోరారు. దీనిపై కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పల్లపు వెంకట్, మండల కార్యదర్శి సీసం సురేష్, ఎర్రం శెట్టి శ్రీనివాస్, పోడియం లక్ష్మణ్, కారం సుబ్బారావు వున్నారు.

గోదావరిలో మృతదేహం లభ్యం

ఎటపాక : నెల్లిపాక సమీపంలో ఆదివారం ఉదయం వరద నీటిలో స్థానికులు గుర్తించిన మృతదేహాన్ని బయటికి తీసి పోలీసులకు సమాచారం అందించారు. ఒడిశాకు చెందిన రాముడు (60)గా గుర్తించారు. పోస్ట్‌మార్టం నిమిత్తం మృతదేహన్ని భద్రాచలం ఏరియా ఆసుపత్రికి పోలీసులు తరలించారు. కాగా మృతుడు రాముడు కొంత కాలంగా నెల్లిపాకలో నివాసం ఉంటూ గేదెలను కాస్తూ జీవిస్తున్నాడు. శనివారం గేదెల కోసం వెళ్లి నీటిలో పడి మృతి చెంది ఉండొచ్చని స్థానికులు భావిస్తున్నారు.

గోదావరిలో లభ్యమైన రాముడు మృతదేహం

బాధితులకు నిత్యావసరాలు ఇవ్వాలి

ముంపు బాధితులతో టిడిపి నేతలు

విఆర్ పురం : మండలంలో అన్నవరం బ్రిడ్జిపై నుంచి గోదావరి వరద నీరు ప్రవహించటంతో అనేక గ్రామాల ప్రజలు రోడ్డు మార్గం లేక ఇబ్బంది పడుతున్నారు. వరదముంపులో ఉన్న గ్రామాలతోపాటు, రోడ్డుమార్గం లేని గ్రామాలకు కూడ వరద సాయంగానిత్యావసరాల సరుకులను అందించాలని విఆర్‌పురం మండల టిడిపి అధ్యక్షుడు ఆచంట శ్రీనివాస్, జెడ్‌పిటిసి జడ్పిటిసి వాళ్ల రంగారెడ్డి, కార్యదర్శి బురక కన్నారావు, నియోజకవర్గం వాణిజ్య విభాగ అధ్యక్షులు బీరక సూర్య ప్రకాశరావు, రాష్ట్ర ఎస్‌టి సెల్ కార్యదర్శి సవలం రాజేంద్రప్రసాద్ డిమాండ్ చేశారు.

పునరావాస కేంద్రానికి తెచ్చి వదిలేశారు

వరద పెరుగుతోందని, వెంటనే ఖాళీ చేయాలన్న అధికారుల హడావిడితో సొంతడబ్బులతో అద్దెకు వ్యాన్ మాట్లాడుకుని సామాన్లు తరలించాం. నాలుగు రోజులు కావస్తున్నా అధికారులు పట్టంచుకోవడం లేదు. బియ్యం, నూనె, ఉప్పు, కారంలాంటివేవీ ఇవ్వకుండా కేవలం కందిపప్పు మాత్రమే ఇచ్చారు. ఇంతవరకు ఏ అధికారి కూడా వచ్చి మా బాధలు చూసిన పాపానపోలేదు. తాగునీటికి కూడా అవస్థలు పడుతున్నామంటే, అధికారులు ఎంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారో తెలుస్తోంది.

పి.సువర్ణ, శబరి ఒడ్డు, చింతూరు మండలం

పట్టించుకునే దిక్కులేదు...

సొంత ఖర్చులతో బళ్ల మాట్లాడుకొని పునరావాస కేంద్రానికి వచ్చాం. ఐదు రోజులు కావస్తున్నా ఏ అధికారి రాలేదు. పట్టించుకోవడం లేదు. సొంతంగా బరకాలు కొనుక్కుని గుడారాలు వేసుకున్నాం. కిరోసిన్ ఇవ్వలేదు. కరెంట్ సౌకర్యం లేదు. చిమ్మచీకట్లో బిక్కుబిక్కు మంటూ జీవనం సాగిస్తున్నాం. తాగునీరు, విద్యుత్ సౌకర్యం కల్పించాలి. నిత్యావసరాలు అందజేయాలి.

ఆసు వీరయ్య,
ధర్మతాలగూడెం, వి ఆర్ పురం మండలం

41.15 కాంటూరులో చేర్చాలని జలదీక్ష

చింతూరు.: పోలవరం ముంపు బాధితుల మొదటి జాబితా 41.15లో తమను చేర్చా చింతూరు మండలం కుయుగుర్ గ్రామస్తులు డిమాండ్ చేశారు. ఆదివారం వరద నీటిలో దిగి నినాదాలు చేస్తూ నిరసనగా జలదీక్ష చేపట్టారు. గతేడాది వరదల అనంతరం మొట్టమొదటిగా ముఖ్యమంత్రి జగన్ తమ గ్రామాన్ని సందర్శించారని, అప్పట్లో అన్ని విధాలా ఆదుకుంటామని, తానున్నానని భరోసానిచ్చారన్నాఉ. అయితే ఇప్పటివరకు ఎటువంటి చర్యలు చేపట్టలేదని, మళ్లీ అదే పరిస్థితి పునరావృతమైనందున తమ గ్రామాన్ని 41.5 కాంటూరులో చేరి, పరిహారం, ప్యాకేజీ ఇప్పించాలని డిమాండ్ చేస్తున్నారు.

వరదనీటిలో నిరసన చేస్తున్న కుయుగుర్ గ్రామస్తులు

ఆందోళన చేపడుతున్న గిరిజనులు

ఖాళీ బిందెలతో ఆందోళన

ప్రజాశక్తి-దుంబ్రిగుడ: మండలంలోని రంగిలిసింగి పంచాయతీ కింజేరు గ్రామంలో తాగునీటి సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేస్తూ ఆదివాసి గిరిజన సంఘం ఆధ్వర్యంలో ఆ గ్రామస్తులు, మహిళలు వర్షంలో ఖాళీ బిందెలతో ఆందోళన చేపట్టారు.ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు టి సూర్యనారాయణ మాట్లాడుతూ, కింజేరు గ్రామంలో 130 కుటుంబాలు ఉండగా తాగునీటి సౌకర్యార్థం రూ.23లక్షల వ్యయంతో మంచినీటి పథకంను నిర్మించారన్నారు. గత మూడు నెలల నుంచి మరమ్మతుకు గురవడంతో గ్రామ సమీపంలోని పొలంలోని ఊటగెడ్డ నుంచి కలుషితమైన్న బురద నీరు ఉపయోగిస్తున్నారని చెప్పారు. మంచి నీటి పథకంను మరమ్మతులు చేపట్టి గ్రామంలో అమర్చిన కొలాయిల ద్వారా నీరు సరఫరా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్. కే.దాసు, పాంగి మోహన్‌దాస్, కె.సన్యాసిరావు, ఆనందరావు, పి.అర్జున్, రాద, సుశీల, గ్రామస్తులు పాల్గొన్నారు.

మణిపూర్ ఘటనలపై ర్యాలీ

ప్రజాశక్తి-పాడేరు: మణిపూర్ రాష్ట్రంలో రోజు రోజుకి చెల రేగుతున్న హింసాకాండను అరికట్టాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతూ పాడేరు పట్టణంలో క్రైస్తవ సంఘాలు ఆదివారం సాయంత్రం కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించాయి. ఈ సందర్భంగా అంబేద్కర్ సెంటర్లో మానవహారం నిర్వహించారు. మణిపూర్‌లో ఆదివాసీలు, క్రైస్తవుల పైన జరుగుతున్న హింసాత్మక ఘటనలను తీవ్రంగా వ్యతిరేకించాయి. మణిపూర్‌లో శాంతిని నెల కొల్పాలని క్రైస్తవులంతా ప్రార్థనలు చేశారు. మణిపూర్ ఘటనలు దేశానికి ముప్పు తలపెట్టే రీతిలో ఉన్నాయని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో క్రైస్తవ సంఘాల నాయకులు రీమలి జాన్ సిహెచ్ దైవ కృప, తిమోతి, ఎలిషా రావు, మోహన్ రావు, రవికుమార్, కళ్యాణం, పాస్టర్లు, మహిళలు పాల్గొన్నారు

ర్యాలీ చేపడుతున్న క్రైస్తవులు

60 వేల హెక్టార్లలో వరి సాగు లక్ష్యం

-90 శాతం సబ్సిడీపై విత్తనాల పంపిణీ -ప్రజాశక్తితో జిల్లా వ్యవసాయ అధికారి ఎస్‌బిఎస్ నంద్



ప్రజాశక్తి-పాడేరు:అల్లూరి జిల్లాలో ఖరీఫ్ వరి సాగు విస్తీర్ణం 60 వేల హెక్టార్లు లక్ష్యమని జిల్లా వ్యవసాయ అధికారి ఎస్.బి.ఎస్ నంద్ వెల్లడించారు. ఈ లక్ష్యానికి అనుగుణంగా జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లో రైతులకు వరి విత్తనాలు 90శాతం సబ్సిడీపై పంపిణీ చేసినట్లు చెప్పారు. జిల్లా వ్యాప్తంగా ఖరీఫ్‌లో చేపడుతున్న వ్యవసాయ పంటల సాగుకు చేపట్టిన చర్యలపై ప్రజాశక్తికి ఇచ్చిన ఇంటర్వ్యూలో తెలిపిన సమాచారం ఆయన మాటల్లోనే...

ఖరీఫ్ సాగు విస్తీర్ణం, లక్ష్యాలు?

జిల్లాలో ఖరీఫ్ సాధారణ విస్తీర్ణం 58 వేల 404 హెక్టార్లకు గాను ఇప్పటివరకు 13 వేల హెక్టార్లలో వరి నాట్లు పూర్తయ్యాయి. రంపచోడవరం డివిజన్లోని వరదల ప్రాంతంలో ఉన్న నాలుగు మండలాల్లో ఇంకా వరి నాట్లు పడలేదు. వరద ఉధృతి తగ్గగానే ఇక్కడ రైతులు నాట్లు వేసేందుకు నారు సిద్ధం చేసుకుని ఉన్నారు.

ఖరీఫ్‌లో ఇతర పంటలు?

మొక్కజొన్న, వేరుశనగ, రాగులు, సామలు, ఇతర చిరుధాన్యాల పంటలు సుమారు 65 వేల హెక్టార్ల విస్తీర్ణంలో రైతులు సాగు చేపట్టారు. ఖరీఫ్ రైతులకు అవసరమైన తోడ్పాటునందించేందుకు చర్యలు తీసుకున్నాం. ఈ మేరకు 652 పచ్చిరొట్ట ఎరువు విత్తనాలు, 17,353 క్వింటాళ్ల వరి విత్తనాలు, 607 క్వింటాళ్ల వేరుశనగ విత్తనాలు 300 క్వింటాళ్ల చోడి విత్తనాలు పంపిణీ చేసాం..

సబ్సిడీతో ఎంతమేర రైతులకు లబ్ధి

ఖరీఫ్ సాగుకు తోడ్పాటు అందించేందుకు రైతులకు పంపిణీ చేసిన వివిధ రకాల విత్తనాలపై 90శాతం సబ్సిడీతో 8కోట్ల 12 లక్షలు సుమారు 50 వేల మంది రైతులకు లబ్ధి చేకూరింది.

రాజ్మా విత్తనాలు పంపిణీ ఎప్పుడు?

పాడేరు ఏజెన్సీ ప్రాంతంలో రైతులకు త్వరలోనే రాజ్మా విత్తనాల పంపిణీకి చర్యలు తీసుకుంటున్నాం. 4,553 క్వింటాళ్ల రాజ్మా విత్తనాలు సిద్ధం చేస్తున్నాం. 90 శాతం సబ్సిడీపై రాజ్మా విత్తనాలను పంపిణీ చేయనున్నాం.

చౌంపి రోడ్డు సమస్యపై నిరసన

ప్రజాశక్తి -అరకులోయ రూరల్: మండలంలోని చౌంపి రోడ్డు మరమ్మత్తులు చేపట్టాలని చౌంపి పంచాయతీ పీసా కమిటీ కార్యదర్శి, వైసీపీ సీనియర్ కార్యకర్త రాజ్ కుమార్ డిమాండ్ చేశారు.ఈ మేరకు ఆదివారం గ్రామ గిరిజనులతో కలిసి రోడ్డుపై నిరసన వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ, చౌంపి జంక్షన్ నుండి బస్కి వరకు సుమారు 22 కిలోమీటర్ల రహదారి పూర్తిగా ధ్వంసమై పెద్ద పెద్ద గుంతలు ఏర్పడి చెరువుల తలపిస్తుందన్నారు. అధికారులు పట్టించుకున్న పరిస్థితులు లేదన్నారు. ఈ గుండా చౌంపి, శిరాగం, బస్కి, మాడగడ, సుంకరమెట్ట, హుకుంపేట మండలం భూర్జ పంచాయతి, వేంగడ పంచాయతీల గిరిజనులు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారని, వీరంతా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. రోడ్డు నిర్మాణం చేపట్టాలని అధికారులకు, ప్రజాప్రతినిధులకు ఎన్నో సార్లు విన్నవించినా పట్టించుకున్న దాఖలాలు లేవని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి చౌంపి రోడ్డు నిర్మాణం చేపట్టి గిరిజనుల రవాణా కష్టాలు తీర్చాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో చౌంపి గ్రామస్తులు పెనుమల మోహన్‌రావు, జల్లేడి రంజిత్ కుమార్, మహేష్ పాల్గొన్నారు.

నినాదాలు చేస్తున్న గిరిజనులు

డ్రైనేజీ నిర్మించాలి

అరకులోయరూరల్: మండలంలోని చౌంపి గ్రామం లో డ్రెయినేజీల నిర్మాణం చేపట్టాలని మాజీ సర్పంచ్ గుజ్జెలి మధునాయుడు డిమాండ్ చేశారు. ఆయన మాట్లాడుతూ, 2001లో గత ప్రభుత్వ హాయంలో కొన్ని వీధుల్లో వేయించిన సీసి రోడ్లు, డ్రైనేజీలు పూర్తిగా ధ్వంసం అయ్యాయని, నిధులు మంజూరు చేసి నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు. డ్రైనేజీ పూర్తిగా ధ్వంసం కావడంతో వర్షాకాలంలో ఎక్కడికక్కడ మురుగునీరు నిల్వ ఉండిపోతుండటంతో దుర్వాసన వెదజల్లుతుందని, దోమల బెడద ఎక్కువైందని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందింక పోవడంతో గిరిజనులు సొంతంగా డ్రైనేజీల నిర్మాణం చేసుకుంటు న్నారన్నారు. అధికారులు, పాలకులు స్పందించి చౌంపి గ్రామంలో డ్రైనేజీలు నిర్మాణం చేపట్టి గిరిజనుల కష్టాలు తీర్చాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయితీ పీసా కమిటీ కార్యదర్శి సాగర రాజ్ కుమార్, ఏపి టూరిజం ఉద్యోగి పెలుమల మోహన్‌రావు, కార్పెంటర్ రామ్మూర్తి, రైల్వే ఉద్యోగి జల్లేడి రంజిత్ కుమార్, గ్రామస్తులు పాల్గొన్నారు.

సెలవులిస్తే చాలు.. ఇంటి బాటలో విద్యార్థులు...

ఇళ్లకు వెళ్లేందుకు బస్సుల్లేక జీపును ఆశ్రయిస్తున్న విద్యార్థులు

ప్రజాశక్తి- పెదబయలు:స్థానిక గిరిజన సంక్షేమ వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థులు వస్తే చాలు ఇంటి బాట పడుతున్నారు. రెండవ శనివారం, ఆదివారం సెలవు కావడంతో ఇళ్లకు వెళ్లిన దృశ్యాలు పాత్రికేయుల కెమెరాలకు చిక్కాయి. పాఠశాల వసతి గృహాలు తెరచి రెండు నెలలు కాలేదు. శనివారం ఉదయం ఇళ్లకు వెళ్లేందుకు కొంతమంది విద్యార్థులు బస్సులు లేక జీపులలో అత్యధిక చార్జీలు చెల్లించి ప్రయాణమయ్యారు. మరికొంత మంది హాస్టల్ సమీపంలో బస్సు స్టాండ్‌లో బస్సు ఎక్కకుండా రోగులపేట జంక్షన్‌లో బస్సు ఎక్కారు. మావోయిస్టుల వారోత్సవాల సందర్భంగా గోమంగి, లక్ష్మీపేటకు బస్సులు రద్దు చేయడంతో ప్రయివేటు వాహనాలను ఆశ్రయించి ఇళ్లకు వెళ్లారు. ఆశ్రమ వసతి గృహాల్లో చదువు కుంటున్న విద్యార్థులు మండల కేంద్రానికి మారుమూల ప్రాంతాలకు చెందిన వారు కావడం తో వారు తల్లిదండ్రుల సహకారంతో వెళ్ళాల్సి ఉంది. కానీ, విద్యార్థులు జట్లు జట్లుగా బయలుదేరి వెళ్తున్నారు. మరుమూల ప్రాంతాల్లో జోరు వర్షంతో వాగులు, వంకలు పొంగుతున్నాయి. ప్రమాదవశాత్తు ఏమైనా జరగరానిది జరిగేతే సమాధానం ఎవరు చెపుతారో తెలియదు. శనివారం ఉదయం స్థానిక నంబర్ వన్ వసతి గృహంలో చదువుతున్న విద్యార్థినులను విలేఖరులు వర్షాలతో ఇళ్లకు ఎందుకు వెళ్తున్నారని ప్రశ్నించగా మెనూ సరిగా అమలు చేయలేదని, పాడైన వంకాయలు, బంగాళాదుంప, దొండకాయలతో పెడుతున్నారని తెలిపారు. పలచ్చని సాంబారు పెడుతున్నారన్నారు. విద్యార్థినిలను తల్లిదండ్రులతో తోడు ఇచ్చి ఇళ్లకు పంపించాలి. ప్రధాన ఉపాధ్యాయుల అనుమతి పొందిన తరువాతనే ఇళ్లకు వెళ్ళాలి. కానీ, నిబంధనలకు విరుద్ధంగా విద్యార్థులను ఇళ్లకు పంపిస్తున్నారు. ఉన్నతాధికారులు వసతి గృహాల్లో పర్యవేక్షణ చేయక పోవడంతో సంక్షేమశాఖ అధికారులు ఇష్టాను సారంగా వ్యవరిస్తున్నారు. ఆగస్ట్ 1 నుండి పరీక్షలు జరగనున్న నేపథ్యంలో విద్యార్థులను ఇళ్లకు పంపించడం ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు.

బోరు ఏర్పాటు చేయిస్తున్న ఎంపిపి నీలవేణి

పాఠశాలలో బోరు ఏర్పాటు

ప్రజాశక్తి -అనంతగిరి:మండలంలోని చిలకలగెడ్డ బాలుర ఆశ్రమోన్నత పాఠశాలలో స్థానిక ఎంపీపీ శెట్టి. నీలవేణి ఆదివారం బోరు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, పాఠశాలకు వెళ్ళినప్పుడు విద్యార్థులు, సిబ్బంది తాగునీటి సమస్యపై తన దృష్టికి తీసుకు వచ్చారని తెలిపారు.అరకు పార్లమెంట్ సభ్యురాలు కొట్టేటి. మాధవి నిధులను మంజూరు చేశారని తెలిపారు.ఈ కార్యక్రమంలో కో ఆప్షన్ సభ్యులు షేక్. మదీనా, నగేష్ పాల్గొన్నారు.

రోడ్డు పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి-పెదబయలు:సీకరి పంచాయతీ వెలపాలెం గ్రామంలో ఎమ్మెల్యే శెట్టి ఫాల్గుణ గత నెలలో గడప గడప కార్యక్రమంలో భాగంగా గ్రామస్తుల అభ్యర్థన మేరకు సిసి రోడ్డు నిర్మాణానికి రూ.5 లక్షల 17 వేలు మంజూరు చేసారు. ఈ మేరకు ఆదివారం స్థానిక సర్పంచ్ గుల్లేలా కృష్ణారావు శంకుస్థాపన చేసి పనులు ప్రారంభిం చారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ వంతల ఆనందరావు, పార్టీ మండల కన్వీనర్ కొర్ర కనకరాజు, మాజీ సర్పంచ్‌ల ఫోరమ్ అధ్యక్షులు పాంగి సింహాచలం పాల్గొన్నారు.

సమస్యలతో సతమతం

- నేడు కలెక్టరేట్ వద్ద 'మిడ్డే' కార్మికుల మహాధర్నా
- బడ్జెట్, వేతనాలు, మెనూచార్జీల పెంపు కోసం పోరు
- ఐక్యంగా కదిలి రావాలని సిఐటియు పిలుపు

ఆందోళనలో పాల్గొన్న మధ్యాహ్న భోజన పథకం కార్మికులు (ఫైల్ ఫొటో)

ప్రజాశక్తి-పాడేరు: ఉద్యోగ భద్రత, వేతనాలు, మెనూ చార్జీల పెంచకపోవడం వంటి సమస్యతో మధ్యాహ్న భోజన పథకం కార్మికులు సతమతం అవుతున్నారు. ఈ మేరకు మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్(సిఐటియు) పిలుపు మేరకు ఈ నెల 31న సోమవారం అల్లూరి జిల్లా కలెక్టరేట్ వద్ద మధ్యాహ్న భోజన కార్మికులు మహా ధర్నా చేపడుతున్నారు. ప్రభుత్వం కార్మికులుగా గుర్తించి కనీస వేతనాలు, మెనూచార్జీలను పెంచాలని మధ్యాహ్న కార్మికులు కోరుతున్నారు. రేషనలైజేషన్ పేరుతో స్కూల్ విలీనం చేయడంతో ఉపాధి కోల్పోతున్న కార్మికులకు ఉపాధి భద్రత కల్పన, సామాజిక భద్రతా సౌకర్యాలు, బడ్జెట్ పెంపు, పథకాన్ని ప్రైవేటు సంస్థలకు అప్పగించరాదని, స్కీమ్ వర్కర్లను కార్మికులుగా గుర్తించాలని గత కొన్నేళ్లుగా చేస్తున్న డిమాండ్లను ప్రభుత్వం పెడచెవిన పెడుతోందని మధ్యాహ్న భోజన కార్మిక సంఘం నాయకులు ధ్వజ మెత్తుతున్నారు.

చెల్లించని బకాయిలు

ఈనెల 31న సోమవారం అల్లూరి జిల్లా కేంద్రంలో జరిగే ధర్నాకు ఏజెన్సీలోని అన్ని మండలాల నుంచి మధ్యాహ్న భోజన కార్మికులు తరలి రావాలి. ఈ మహా ధర్నాలో పాల్గొని జయప్రదం చేయాలి. ప్రతి పాఠశాల నుంచి మధ్యాహ్న భోజన కార్మికులు ఐక్యంగా కదిలి వచ్చి ఈ పోరాటం ద్వారా ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి తమ సమస్యల్ని పరిష్కరించుకోవాలి. కేంద్ర ప్రభుత్వం పెరుగుతున్న ధరలకు అనుగుణంగా బడ్జెట్ పెంచక పోగా 2013-14 లో కేంద్ర బడ్జెట్లో రాష్ట్రానికి సంబంధించి రూ, 13,215 కోట్ల నుండి 11వేల కోట్లకు, 2022-2023లో 10,234 కోట్లకు బడ్జెట్ తగ్గించారు. గతంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల వాటా 90:10 శాతాన్ని మోడీ ప్రభుత్వం 60:40 శాతానికి తగ్గించింది. రోజుకి 6, నుంచి 7 గంటలు పని చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులకు గౌరవ వేతనం పేరుతో రూ,1000 మాత్రమే ఇచ్చేవారు. దీనిపై యూనియన్ ప్రభుత్వంపై పోరాడి రూ.3వేల వేతనం పెంపును సాదించింది. ప్రస్తుతం ఈ వేతనాన్ని కూడా సక్రమంగా చెల్లించక పోవడం, నెలల తరబడి బకాయిలుంటున్నాయి. కనీస వేతనం లేదు. పైగా ఏడాదికి పది నెలలకే వేతనం ఇస్తున్నారు.

కార్మికుల ప్రధాన డిమాండ్స్

రేషనలైజేషన్ పేరుతో స్కూల్ విలీనం చేయడం వల్ల ఉపాధి కోల్పోతున్న మిడ్ డే మిల్స్ వర్కర్లకు ఉపాధి భద్రత కల్పించాలి. పథకంలో పని చేస్తున్న కార్మికులను కార్మికులుగా గుర్తించి కనీస వేతనం ఇవ్వాలి, ప్రతి నెలా 5వ తేదీ లోపు వేతనాలు, బిల్లులు ఇవ్వాలి. మెనూ చార్జీలకు రూ.20 ఇవ్వాలి. ధరల పెరుగుదలకు అనుగుణంగా బడ్జెట్ పెంచాలి. ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలి. వంట చేసేటప్పుడు అగ్ని ప్రమాదానికి గురైన వారికి నష్ట పరిహారం చెల్లించాలి. స్కూల్ విలీనం పేరుతో తొలగించిన కార్మికులకు హైస్కూల్లో అవకాశం కల్పించాలి. గుర్తింపు కార్డులు ఇవ్వాలి. పథకాన్ని ప్రైవేటు సంస్థలకు అప్పగించరాదు. ఉద్యోగ భద్రత కల్పించాలి.గ్యాసు ప్రభుత్వమే సరఫరా చేయాలి. పథకం అమలుకు కనీస మౌలిక సదుపాయాలు కల్పించాలి. హైస్కూలులో పనిచేస్తున్న వారికి వేతనం ఇవ్వాలి. రాజకీయ వేధింపులు ఆపాలి. రిటైర్మెంట్ బెనిఫిట్స్, యూనిఫామ్ ఇవ్వాలి. రాగి జావ తయారు చేయడానికి వంటపాత్రలు, గ్యాస్ స్టవ్, గ్యాస్ ప్రభుత్వమే ఇవ్వాలి.

సౌకర్యాల కల్పన ఏదీ?

సామాజిక భద్రత పెన్షన్లు లేవు. పథకం అమలుకు పాఠశాలలో వంటషెడ్లు, వంట పాత్రలు, మంచినీరు, గ్యాస్ సరఫరా వంటి మౌలిక సదుపాయాల కల్పనలో శ్రద్ధలేదు. రాష్ట్రంలో వైఎస్సార్సిపి ప్రభుత్వం 2019 లో అధికారంలోకి రాగానే పథకాన్ని స్వచ్ఛంద సంస్థలకు అప్పగించేందుకు ప్రణాళిక సిద్ధం చేసింది.

పసుపులేటి లక్ష్మి
జిల్లా అధ్యక్షులు

నిర్లక్ష్యం వీడాలి

మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో మండల స్థాయి నుండి రాష్ట్ర స్థాయి ఆందోళనలు నిర్వహించిన పిదప కొద్ది ప్రాంతాల్లో మాత్రమే సెంట్రలైజ్డ్ కిచెన్ ఏర్పాటు తో ప్రభుత్వం వెనక్కి తగ్గింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మధ్యాహ్న భోజన కార్మికుల పట్ల నిర్లక్ష్యం వీడి సమస్యలన్నీ పరిష్కరించాలి.

సోమ్ దేవి,
జిల్లా ప్రధాన కార్యదర్శి,
మధ్యాహ్న భోజన కార్మిక యూనియన్, అల్లూరి జిల్లా.

నేడు న్యాయవాదుల విధుల బహిష్కరణ

ప్రజాశక్తి-లీగల్ విలేకరి : ఇటీవల విజయవాడలో ఒక న్యాయవాదిని సంఘ విద్రోహ శక్తులు హత్య చేసినందుకు నిరసనగా సోమవారం విశాఖ న్యాయవాదులు విధుల బహిష్కరణకు పిలుపునిచ్చారు. విజయవాడ బార్ అసోసియేషన్ న్యాయవాది ఆర్.ఆదిశేషు విటల్‌బాబును ప్రకాశం జిల్లా అద్దంకిలో హత్య చేశారని న్యాయవాదులు తెలిపారు. నిందితులను తక్షణమే పోలీసులు అరెస్ట్ చేయాలని, ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా డిజిపి చర్యలు తీసుకోవాలని, న్యాయవాదులకు రక్షణ చట్టం చేయాలని న్యాయవాదుల సంఘం అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు చింతపల్లి రాంబాబు, పైలా శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. జిల్లా కోర్టు ప్రధాన ద్వారం వద్ద సోమవారం ఉదయం 11:30కు చేపట్టే రాస్తారోకోను జయప్రదం చేయాలని కోరారు.

నేరాలు ఘోరాలు

రుషికొండలో తిరగబడ్డ బోటు

ప్రజాశక్తి- మధురవాడ : ఆంధ్రప్రదేశ్ పర్యాటకాభివృద్ధి సంస్థ రుషికొండ బీచ్‌లో నిర్వహిస్తున్న బోటు షికారులో ఆదివారం అపశృతి చోటుచేసుకుంది. సముద్రం మధ్యలో పెద్ద అల తాకిడీకి బోటు తిరగబడింది. తిరగబడ్డ సమయంలో బోటు డ్రైవర్, ఇద్దరు విద్యార్థులు మాత్రమే ఉన్నారు. ఇందులో పెందుర్తి ముషిడివాడకు ప్రాంతానికి చెందిన ఇంటి రవి(25), మధురవాడ శివశక్తినగర్‌కు చెందిన బొత్స సురేష్ (25) ఉన్నారు. లైఫ్ జాకెట్లు ధరించి ఉండటంతో డ్రైవర్ పి.లక్ష్మణరావు, ఇద్దరు యువకులు సురక్షితంగా బయటపడ్డారు. లైఫ్ గార్డులు తలుపులు, రాజు సహకారంతో బోటును, యువకులను సురక్షితంగా ఒడ్డుకు తీసుకొచ్చారు.

ఘనంగా రావి శాస్త్రి జయంతి

ప్రజాశక్తి-లీగల్ విలేకరి : తాడిత, పీడిత వర్గాల జీవిత మూలాలే కథా వస్తువుగా సమాజంలో ఎన్నో సమస్యలకు అక్షర రూపాన్ని ఇచ్చి కథలుగా మలిచిన మహా మనిషి రాచకొండ విశ్వనాథశాస్త్రి అని పలువురు ప్రముఖులు కొనియాడారు. ప్రముఖ న్యాయవాది, రచయిత ఆర్‌వి.శాస్త్రి జయంతిని బీచ్ రోడ్‌లోని కిర్లంపూడిలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. రావిశాస్త్రి చిత్రపటానికి ప్రముఖ న్యాయవాది చీమలపాటి శ్రీరామ్మూర్తి పూలమాల వేసి అంజలి ఘటించారు. పలువురు నగర ప్రముఖులు, న్యాయవాదులు, రచయితలు పాల్గొని శాస్త్రి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు.

ప్రముఖ రచయిత డాక్టర్ రఘురామారావు మాట్లాడుతూ శాస్త్రి ప్రతి రచనా సామాజిక చైతన్యానికి గుర్తుగా నిలుస్తోందని వివరించారు. ఆరు సారాల కథలు, రత్తాలు రాంబాబు ఇల్లు తదితర రచనలు సజీవ శిల్పాలుగా పేర్కొన్నారు. జూనియర్ ఆర్‌వి.శాస్త్రి, న్యాయవాది శిష్ట శ్రీనివాసమూర్తి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో న్యాయమూర్తి డాక్టర్ టివి.రమణ, శాస్త్రి కుమారుడు ఉమా శాస్త్రి, విశాఖ న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు చింతపల్లి రాంబాబు, ఉపాధ్యక్షులు బిఎస్.లత, కార్యదర్శి పైలా శ్రీనివాసు, డాక్టర్ శ్రీధర్, డాక్టర్ ఎన్‌వి.శాస్త్రి, సీనియర్ న్యాయవాదులు ఎం.రవి, గొలగాని అప్పారావు, రచయితలు విహారి, ఆచార్య వెలమల సిమ్మన్న పాల్గొన్నారు.

బీచ్ రోడ్డులో అవగాహన కల్పిస్తున్నగీతం దంత కళాశాల విద్యార్థులు

నోటి ఆరోగ్యంపై చైతన్యం

ప్రజాశక్తి-మధురవాడ : నోటి ఆరోగ్యంపై ప్రజలను చైతన్య పరచడంలో భాగంగా గీతం దంత వైద్యకళాశాల, ఆసుపత్రి ఆధ్వర్యాన ఆర్‌కె.బీచ్‌లో ఆదివారం చైతన్య నడక, ఫ్లాష్ మాబ్ నిర్వహించారు. ఆగస్టు 1న జాతీయ నోటి ఆరోగ్య దినోత్సవం సందర్భంగా గీతం దంత కళాశాల పెరియోడాంటిక్స్ విభాగం నిర్వహించిన కార్యక్రమంలో చైర్ ప్రొఫెసర్ డాక్టర్ వై.రవిశంకర్ మాట్లాడుతూ, నోటిని ఆరోగ్యంగా ఉంచుకోవడం ద్వారా శరీరాన్ని చాలా రోగాల బారిన పడకుండా కాపాడుకోవచ్చన్నారు. పొగాకు సంబంధ ఉత్పత్తుల నుంచి దూరంగా ఉండటం, దంత సంరక్షణ, తరచూ బ్రష్‌లను మార్చడం, తీయటి పదార్థాలను తగ్గించుకోవడం, తాజా పళ్ళను స్వీకరించడం, దంత వైద్యులను సంప్రదించడం చేయాలని సూచించారు. దంత విద్యార్థులు నోటి ఆరోగ్యంపై బ్యానర్లను ప్రదర్శించారు. కార్యక్రమంలో విభాగాధిపతి డాక్టర్ వై.త్రినాధ్‌కిషోర్, ఇతర దంత వైద్యులు పాల్గొన్నారు. దాదాపు 100 మంది దంత వైద్య విద్యార్థులు బీచ్ రోడ్డులో వాకర్స్‌తో పాటు సాధారణ ప్రజలకు నోటి ఆరోగ్య ప్రాధాన్యతను తెలిపే డిజిటల్ సమాచారం ప్రదర్శించారు.

ఆయుర్వేద వైద్య శిబిరానికి హాజరైన ప్రజలు

ఉచిత వైద్య శిబిరాలకు స్పందన

ప్రజాశక్తి-అడ్డతీగల : వై.రామవరం మండలంలోని లోతట్టు గ్రామాలైన నూగంటి పాలెం, బుల్లోజుపాలెం, ఎర్రం రెడ్డిపాలెం, మునుసలపాలెం, బొట్టపల్లి, కె.ఎర్రగొండ, రేగడిపాలెం, చందుర్తి, పెదవులింపాడు, దాలిపాడు, గుమ్మరిపాలెం, పులుసుమామిడి గ్రామాలలో ఆదివారం లయ సంస్థ ఆధ్వర్యంలో ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహించారు. ఆయుష్ విభాగం రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్: వెంకటకృష్ణ నేతృత్వంలో నిర్వహించిన ఈ ఆయుర్వేద వైద్య శిబిరాలలో ప్రభుత్వ ఆయుర్వేద వైద్యులు డాక్టర్ రాజరాజేశ్వరి, డాక్టర్ నీలిమ, డాక్టర్ మౌళినాయక్, డాక్టర్ నాగేంద్ర డాక్టర్ డి పద్మజ డాక్టర్ జె పద్మజాల పాల్గొని రోగులను పరీక్షించి వైద్యసేవలు అందించారు. 450 మంది రోగులను పరీక్షించి ఉచితంగా ఆయుర్వేద మందులు పంపిణీ చేయడమైనది. రోగులకు ఉచితంగా మందులు అందించారు. కార్యక్రమంలో లయ కార్యకర్తలు పాల్గొన్నారు

రంపచోడవరం : మండలంలోని తామరపల్లి పంచాయతీలో ఆదివారం ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. ఆప్తాల్మిక్ ఆఫీసర్ కిషోర్, మన్యం విజన్ టెక్నీషియన్ రాజు రోగులకు కంటి పరీక్షలు నిర్వహించారు. రోగులకు ముసిరిమిల్లి ఎంపిటిసి వంశి కుంజంలి మందులు, కంటి చుక్కలు, కళ్లద్దాలను పంపిణీ చేశారు. కంటి ఆపరేషన్‌కు ఎంపికైన వారికి తానే ఆటోలో ఆసుపత్రికి తరలించే ఏర్పాట్లు చేస్తానని ఎంపిటిసి తెలిపారు. కార్యక్రమంలో వార్డ్ సభ్యులు లక్ష్మి, రమణా రెడ్డి, గృహ సారధి చిరంజీవి, మాజీ ఎంపిటిసి తురసం వీరాయమ్మ, సౌజ స్కూల్ కరస్పాండెంట్ సారపు రవి చంద్ర(దొర), గ్రామ పెద్దలు, ఎఎన్ఎం వెంకటలక్ష్మి, ఆశ కార్యకర్తలు సావిత్రి, లక్ష్మి, చిట్టిమ్మ, వాలంటర్ విశ్వ పాల్గొన్నారు

సీలేరు: సీలేరు మాలయం సెంటర్ వద్ద అపోలో డాక్టర్స్ అసోసియేషన్ సౌజన్యంతో ఆదివారం మెగా వైద్య శిబిరం నిర్వహించారు. స్థానిక ప్రజలతో పాటు చుట్టుపక్కల నుంచి వారపు సంతకు వచ్చిన గిరిజనులు వైద్యసేవలు వినియోగించుకున్నారు. ఈసందర్భంగా 315 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.కార్యక్రమంలో న్యూరో ఫిజిషియన్ డాక్టర్ రాజేష్, రేడియాలజిస్ట్ వెంకట, వాస్కులర్ సర్జన్ డాక్టర్ రవి వర్మ, ఆంకాలజిస్ట్ డాక్టర్‌హేమంత్, గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్ డాక్టర్ నాగవర్మ శ్రీనివాస్, ఆర్థోపెడిక్ డాక్టర్ రాజ్, స్థానిక పిహెచ్‌సి వైద్యాధికారులు డాక్టర్ ఖాదర్ మస్తాన్ వలీ, డాక్టర్ సౌమ్య శిబిరంలో పాల్గొని వైద్య సేవలు అందించారు.

మణిపూర్ నిందితులను కఠినంగా శిక్షించాలి

ప్రజాశక్తి -మారేడుమిల్లి : మణిపూర్ మహిళలను వివస్త్రలను ఊరేగించి, అత్యాచారం, హతమార్చిన నరరూప రాక్షసులైన నిందితులను కఠినంగా శిక్షించాలని మారేడుమిల్లి మండల ఫాస్టర్స్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. ఆదివారం మారేడుమిల్లి ప్రధాన కూడలిలో క్రొవొత్తులతో, నల్ల బ్యాడ్జిలతో నిరసన చేపట్టారు. ఫాస్టర్స్ ఫెలోషిప్ ట్రెజరర్ సిహెచ్ ప్రసాద్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో గౌరవాధ్యక్షులు బిషప్ జి శ్రీకాంత్, బి ప్రభాకరరావు మాట్లాడుతూ 80 రోజులుగా మణిపూర్‌లో మారణకాండ సాగుతున్నా వాటిని అరికట్టకపోవడం దారుణమన్నారు. వందలాది క్రైస్తవ సంఘాలను ఇబ్బందులకు గురిచేసి, 150కి పైగా ప్రజలను చంపి, వేలాది మందిని నిరాశ్రయులను చేసిన అకృత్యంపై ప్రధాని మోడీ స్పందించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడం దారుణమని ఖండించారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభ్యులు బాలాజీబాబు మాట్లాడుతూ కేంద్రహోంమంత్రి అమిత్‌షా పర్యటన తర్వాత మణిపూర్‌లో అల్లర్లు మరింత పెరగడం దుర్మార్గమన్నారు. మారేడుమిల్లి మండల పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షులు సి.శామ్యూల్ మాట్లాడుతూ మణిపూర్‌లో హింసకు కేంద్ర ప్రభుత్వం బాధ్యత వహించాలన్నారు. కార్యక్రమంలో మండల ఫెలోషిప్ కార్యదర్శి ఇన్నా ఆనంద్, ఉపాధ్యక్షులు ఎల్.పాల్‌బుజ్జి, గొర్లె అకీమ్ రాజు, జూన్ పీటర్, మాజీ ఎంపిటిసి గొర్లె అనిల్ ప్రసాద్, గరిడే బాబురావు, దూడ సువర్ణ కర్ణకుమార్, దూడ ప్రణీత్, దూడ విల్సన్ ప్రొల్గొన్నారు.

బిజెపి చర్యలతో ప్రమాదంలో ప్రజాస్వామ్యం

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.వెంకటేశ్వర్లు

మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు, వేదికపై కిరణ్, తదితరులు

ప్రజాశక్తి- రాజవొమ్మంగి: కేంద్రంలో నరేంద్రమోడీ నేతృత్వంలోని బిజెపి ప్రభుత్వ పాలనలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందనడానికి మణిపూర్ అకృత్యాలే నిదర్శనమ సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.వెంకటేశ్వర్లు మండిపడ్డారు. ఆదివారం రంపచోడవరం పార్టీ కార్యాలయంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యురాలు ఎం వాణిశ్రీ అధ్యక్షతన జరిగిన రంపచోడవరం జిల్లాలోని ఏడు మండలాల పార్టీ విస్తత స్థాయి సమావేశం జరిగింది. ఈసందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, మూడున్నర నెలలుగా మణిపూర్‌లో గిరిజనం, మహిళలపై ఆరాచకాలు, దాడులు జరుగుతున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చూసీచూడనట్లు వ్యవహరించడం ఆందోళనకర మన్నారు. ఇంత జరుగుతున్నా డబుల్ ఇంజన్ సర్కారు, ఇంటలిజెన్స్ వర్గాలు ఏం చేస్తున్నాయని ప్రశ్నించారు. ఆర్ఎస్ఎస్ కనుసన్నల్లో బిజెపి మతోన్మాద చర్యల కారణంగానే మణిపూర్‌లో మానవ సమాజం సిగ్గుపడే అమానవీయ ఘటనలు జరుగుతున్నా రాష్ట్రపతి, కేంద్రహోంమంత్రిత్వశాఖలు మౌనం దాల్చడం అన్యాయమన్నారు. మణిపూర్ ఘటనలు పునరావతం కాకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో బోయ/వాల్మీకులను ఎస్‌టి జాబితాలో చేర్చొద్దని ఒకవైపు గిరిజనులు పెద్ద ఎత్తున ఆందోళనలు, ఉద్యమాలు, పోరాటాలు చేస్తుంటే, ప్రస్తుత పార్లమెంట్ సమావేశాల్లో వైసిపి రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి బోయ/వాల్మీకులను ఎస్‌టి జాబితాలో చేర్చాలని తీర్మానం ప్రవేశపెట్టడం దుర్మార్గమన్నారు. దీనిపై రాష్ట్రంలోనిలో గిరిజన ఎమ్మెల్యేలు, ఎంపీలు తమ వైఖరి స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. ఆదివాసీలను అడవుల నుంచి గెంటేసే కుట్రలో భాగంగా, గిరిజనుల మనుగడ ప్రశ్నార్థకం చేస్తూ, అటవీ హక్కుల చట్టం నూతన సవరణబిల్లును కేంద్రం ఆమోదించడంపై ఆవేదన వెలిబుచ్చారు. గిరిజనులను వెన్నుపోటు పొడిచే స్వార్ధ రాజకీయ పార్టీలను, నాయకుల చర్యలను ఎండగట్టి, అటవీ హక్కులను రక్షించుకునేందుకు సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు, ఏజెన్సీ ప్రాంత అభివద్ధి, మన్యంలో సమస్యల పరిష్కారానికి చొరవ చూపని పాలకులు, ఇక్కడి సంపదను, సహజ వనరులను కార్పొరేట్లకు దోచిపెట్టే చర్యలు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ఏజెన్సీలో విద్య, వైద్యం, విద్యుత్, తాగునీరు, రహదారుల వంటి కనీస మౌలిక వసతులు కల్పనకు ప్రభుత్వం కృషి చేయాలని, పిహెచ్‌సిలో తగినంత మంది వైద్యులు, సిబ్బంది, అవసరమైన మందులు అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం రంపచోడవరం జిల్లా కార్యదర్శి బొప్పిన కిరణ్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు లోతా రామారావు, ఏడు మండలాల నాయకులు కొండ్ల సూరిబాబు, కుంజం జగన్నాధం,ఈ సిరిమల్లురెడ్డి, కె శాంతిరాజు, గంగిరెడ్డి, మల్లికార్జునరావు, రామరాజు చల్లయ్యమ్మ, టి శ్రీను, రామలక్ష్మి పాల్గొన్నారు.

సంక్షేమ హాస్టళ్లకు స్థలాలు కేటాయించాలి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి - కలెక్టరేట్ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బడా కార్పొరేట్ సంస్థలకు ప్రభుత్వ భూములను కారుచౌకగా కట్టబెడుతున్నాయని, ఆ ప్రయత్నాలను విరమించి రాష్ట్రంలో ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీ విద్యార్థుల సంక్షేమ హాస్టళ్లకు స్థలాలు కేటాయించి భవన నిర్మాణాలు చేపట్టాలని ఎస్ఎఫ్ఐ విశాఖ జిల్లా కార్యదర్శి ఎల్‌జె.నాయుడు రాష్ట్ర ముఖ్యమంత్రిని డిమాండ్ చేసారు. ఆదివారం జగదాంబ దరి సంఘం జిల్లా కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ పదిహేనేళ్లుగా అణగారిన తరగతులకు చెందిన విద్యార్థులు తమ హాస్టళ్లకు స్థలాలు కేటాయించి సొంత భవనాలు నిర్మించాలని డిమాండ్ చేస్తున్నా పాలకులు పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు. సిఎం జగన్మోహన్‌రెడ్డి విద్యా వ్యవస్థలో మార్పులు తెస్తున్నామని చెప్పి ఉన్న స్కూళ్లను విలీనం చేయడం, హాస్టళ్లను మూసివేయడం వంటి చర్యలు చేపట్టడంతో పేద, సామాన్య విద్యార్థులకు విద్య దూరమవుతోందని అన్నారు. విశాఖలోని సాలిగ్రామపురంలో ఉన్న పోర్టు ట్రస్టుకు చెందిన 17 ఎకరాల భూమిని రహేజా సంస్థకు ఇనార్బిట్ మాల్ పేరిట 30 ఏళ్ళ లీజుకు కట్టబెట్టడం దారుణమన్నారు.

నగరంలో ఆరు సంక్షేమ హాస్టళ్ల శిథిలావస్థలో ఉన్నాయని, ఏ ఒక్కదాన్ని కూడా ప్రభుత్వం నిధులు కేటాయించి మరమ్మతులు చేసిన దాఖలాలు లేవని అన్నారు. తక్షణమే సంక్షేమ హాస్టళ్లకు సొంత భవనాలు నిర్మిస్తామని ఆగస్టు 1న విశాఖకు వస్తున్న సిఎం ప్రకటించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో సంఘం నాయకులు శశి కుమార్, కౌశిక్, మణికంఠ, హర్షిత్, తులసి, దివాకర్ పాల్గొన్నారు.

మైక్రో సర్జరీ, మైక్రోవాస్కులర్‌పై సదస్సు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖలో తొలిసారిగా ఎన్ఎస్ఐ న్యూరోలాజికల్ సొసైటీ ఆఫ్ ఇండియా, బోర్డ్ ఆఫ్ ఎడ్యుకేషన్ జోనల్ మైక్రో న్యూరో సర్జరీ, మైక్రోవాస్కులర్ సూచరింగ్‌పై వర్క్‌షాప్‌ను శని, ఆదివారాల్లో ఓ హోటల్‌లో నిర్వహించారు. విశాఖపట్నంలోని అపెక్స్ ఐఒఎన్ఎస్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. దేశంలోని వివిధ ప్రాంతాల నుండి న్యూరో సర్జరీ ప్రతినిధులు హాజరయ్యారు. మైక్రో సూచరింగ్ టెక్నిక్స్, మైక్రోవాస్కులర్ సూచరింగ్‌లో తగు సలహాలు, సూచనలు అందించారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ న్యూరోసర్జన్లు డాక్టర్ కె.శ్రీధర్ (చెన్నయ్), డాక్టర్ పరితోష్ పాండే (బెంగళూరు), డాక్టర్ విను గోపాల్ (కొట్టాయం), డాక్టర్ సందీప్ తలారి (విశాఖపట్నం) అధ్యాపకులుగా ఉన్నారు. డాక్టర్ కె.స్రవంత్ (న్యూరోసర్జన్, అపెక్స్ ఐఒఎన్ఎస్ హాస్పిటల్) సమన్వయకర్తగా వ్యవహరించారు. డాక్టర్ జి.బుచ్చిరాజు (ప్రిన్సిపల్, ఆంధ్రా మెడికల్ కాలేజ్), డాక్టర్ కె.సత్య వరప్రసాద్ (మాజీ డిఎంఇ, మాజీ ప్రొఫెసర్ న్యూరోసర్జరీ) హాజరయ్యారు.

సీలేరు సంతలో కూరగాయలు కొంటున్న వినియోగదారులు

భగ్గుమన్న కూరగాయల ధరలు

ప్రజాశక్తి -సీలేరు: సీలేరు వారపుసంతలో టమాటా, పచ్చిమిర్చి, ఇతర కూరగాయలు ధరలు భగ్గుమన్నాయి. టమాట కిలో రూ.220, పచ్చిమిర్చి కిలో రూ.200లకు వ్యాపారులు విక్రయించడంతో సామాన్య, మధ్యతరగతి కుటుంబీకులు, దినసరి కూలీలు అటువైపు చూడడం మానేశారు. ఎపి జెన్‌కో ఉద్యోగుల మాత్రం కొన్నాం అనిపించుకునేలా కొంచంకొంచం కొనుగోలు చేశారు. కొద్దిరోజులుగా ఆకాశానికేసి చూస్తున్న టమాటా ధరలు, రోజురోజుకూ పైపైకి ఎగబాకడమే తప్ప కిందికి దిగి రాకపోవడంతో నెలరోజులకు పైగా సామాన్యుల కూరల్లో టమోటా కనిపించడం మానేసింది. బీన్స్, క్యారెట్, బీట్‌రూట్, పొటల్స్, కాలీఫ్లవర్, ఇతరత్రా కూరగాయలను కిలో రూ.100 చొప్పున విక్రయించారు. ఇదిలా ఉంటే చింతూరు, కూనవరం తదితర ప్రాంతాల నుంచి వ్యాపారులు సీలేరు వారపు సంత కూరగాయలు తెచ్చే వ్యాపారులు, ప్రస్తుతంఅక్కడ నెలకొన్న వరద ఉధృతితో రాలేని పరిస్థితి ఉంది. దుప్పిలివాడ పంచాయతీ గిరిజన మాలీలు సీలేరు వారపుసంతకు కూరగాయలు తెచ్చి విక్రయించే పరిస్థితి ఉండగా, అక్కడా ఆశించినంతగా పంటలు లేకపోవడంతో మైదాన ప్రాంతం నుంచి, ఆంధ్రాసరిహద్దులోని ఒడిశా గ్రామాలను నుంచి కూరగాయాలను సేకరించి సీలేరు వారపుసంతకు తెచ్చామని వ్యాపారులు అంటున్నారు.

పలుచోట్ల పోలీసుల విస్తృత తనిఖీలు

ప్రజాశక్తి - సీలేరు: మావోయిస్టులు అమరవీరుల సంస్కరణ దినోత్సవంతో అప్రమత్తమైన పోలీసులు ఆదివారం దారకొండ వారపుసంతలో పోలీసులు విస్తృత తనిఖీలు నిర్వహించారు. స్థానిక ఎస్ఐ రామకృష్ణ, సిఆర్‌పిఎఫ్ పోలీసు బలగాల మోహరించి వారపుసంతలో ప్రత్యేక నిఘా పెట్టి తనిఖీలు చేశారు. దారకొండ ప్రధానరహదారి, ముఖ్య కూడళ్లలో వాహన తనిఖీలు చేపట్టారు. అనుమానితులను ప్రశ్నించి విడిచిపెట్టారు. ఆంధ్ర ఒరిశా సరిహద్దు ప్రాంతం నుంచి వచ్చే వాహనాలను క్షుణ్ణంగా తనిఖీలు చేసి విడిచిపెట్టారు. వారపు సంతలో నకిలి వస్తువులపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు.

కొయ్యూరు: మావోయిస్టు వారోత్సవాలు జరుగుతున్న నేపథ్యంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలో భాగంగా బాలరేవుల రోడ్డులో మంప ఎస్ఐ లోకేష్ ఆధ్వర్యంలో పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. అనుమానిత వ్యక్తులను ప్రశ్నించి, ప్రమాదం లేదని నిర్ధారించుకున్న తర్వాత విడిచిపెట్టారు.బాలరేవుల, కునుకూరు, పొకలపాలెం, గోధుమలంక, కన్నవరం, నల్లబిల్లి, బొడ్డు మామిడి తదితర గ్రామస్తులతో మాట్లాడి, గ్రామాల్లో ఎవరైనా అనుమానిత, అపరిచిత వ్యక్తులు సంచరించినట్లయితే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. మావోయిస్టు కార్యకలాపాలకు మన్యవాసులు సహకరించవద్దని, వారికి ఆశ్రయమిస్తే నేరస్తులౌతారని హెచ్చరించారు.

సిఎం విశాఖ పర్యటన ఖరారు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఆగస్టు 1న సిఎం వైఎస్.జగన్మోహన్ రెడ్డి విశాఖపట్నంలో పర్యటించనున్నారని ముఖ్యమంత్రి కార్యాలయం ఆదివారం ఒక ప్రకటనలో వెల్లడించింది. ఈ పర్యటనలో భాగంగా ఉదయం 9:30 గంటలకు సిఎం గన్నవరం ఎయిర్‌పోర్టులో బయలుదేరి 10:45 గంటలకు విశాఖ చేరుకుంటారు. అక్కడి నుంచి 10:55 గంటలకు కైలాసపురం వెళ్తారు. 11:15 నుంచి 12:20 గంటలు మధ్య ఇనార్బిట్ మాల్ శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం 12:40 గంటలకు సిరిపురంలోని ఆంధ్ర విశ్వవిద్యాలయానికి చేరుకుని అక్కడ నిర్మించిన నాలుగు భవనాలను ప్రారంభిస్తారు. తదుపరి అక్కడి నుంచి 1:00 గంటకు బీచ్ రోడ్డులోని ఎయు కన్వెన్షన్ సెంటర్‌కు చేరుకొని ఎయు విద్యార్థులతో సమావేశమవుతారు. 1:20 గంటలకు అక్కడి నుంచి బయలుదేరి 1:50 గంటలకు విశాఖపట్నం ఎయిర్‌పోర్టుకు వచ్చి విజయవాడకు వెళ్తారు.